# క్రిందమెట్టుకి దిగండి

ఊరికంతటికీ పెద్ద రైతు భూషయ్యగారింట్లో పెళ్ళి. పెళ్ళి నెలరోజులుందనగానే వారింట్లో హడావిడి మొదలయ్యింది.

ఆయనింట్లో మొదలయిన యిరవై రోజులకు ఊళ్లోనూ, అంతకు పది రోజుల ముందుగానే సూరయ్యగారింట్లోనూ హడావిడి మొదలయ్యింది.

భూషయ్య గారింట్లో పెళ్ళి అంటే మాటలా మరి. ఆయనా వూరిలో యేభై ఎకరాల మాగాణీ పొలం వున్న మనిషి. ఆయన తండ్రి హయాంలో వారింట్లో యేవైనా కార్యకరామత్తులు జరిగితే (శుభమైనా అశుభమైనా) దాదాపు పక్షం రోజులు వూరు వూరంతా వారింట్లోనే తినేవారు. అశుభకార్యమయితే పక్షం రోజులకు వో నాలుగయిదు రోజులు తగ్గటం మినహా మరేం పెద్ద తేడా వుండేది కాదు. ఆ వూళ్లో వున్న సూరయ్య, బాపయ్యగార్ల కుటుంబాలు అట్లాంటి సమయాల్లో కార్యానికి దాదాపు నెలరోజుల ముందు నుంచీ అయిం తర్వాత పది రోజుల వరకూ భూషయ్య గారింట్లోనే మకాం పెట్టేస్తాయ్. భూషయ్య గారలా జరక్కపోతే వూరుకోరు కూడాను. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడిలాగా సూరయ్య, బాపయ్యలు నానా హయిరానా పడ్తారు కూడాను. వీళ్ళా వూళ్ళో భూమీ పుట్రాలేనివాళ్ళు; పుట్టెడు పిల్లలున్నవాళ్ళు, పైగా వాళ్ళుగాక ఆ వూళ్ళోవున్న మిగతా వాళ్ళు భూషయ్యగారంత మోతుబరులు కాకపోయినా కాస్తో, కూస్తో పొలంవున్న వాళ్ళే. అందుచేత ఈ రెండు కుటుంబాలే భూషయ్యగారింట్లో మకాం పెట్టడం ఆనవాయితీ. అలా పెట్టించటం భూషయ్యగారి రివాజు. తనకున్న పొలాన్నీ, పలుకుబడిని పెంచుకోవటం అంటే ఆయన కెక్కళ్ళేని పట్టుదల. మొదటి విషయంలో యెరువుల మీదా, వూళ్ళోని తగవుల మీదా ఆధారపడ్డాటే రెండో దానికి ఈ రెండు కుటుంబాల మీదా ఆధారపడ్తారాయన. ఆధారపడ్తాడూ అంటే పడ్డుమరీ; రోజుకో వంద సార్లు పదిమంది చేత – "భూషయ్యగారే లేకపోతే ఆ కుటుంబాలు దిక్కులేని చావు చచ్చేవి" అని చెప్పించుకోవటం ఆయనకు ఆనందం. ఆ కుటుంబాల ముందే అనిపించుకోవటం ఆయనకు మరింత సరదా కలిగించే విషయం. ఆయన దానగుణానికి, ఆయన ధర్మనిరతికి దర్పణాలుగా ఆ రెండు కుటుంబాల్ని ఆయన వాడుకుంటాడు.

పెళ్ళింకా నెలరోజుల పైగా వుందనగానే సూరయ్యగారికి పిలుపొచ్చింది "భూషయ్యగారు రమ్మన్నారం"టూ.

ఆ పల్లెటూరికి ఏడెనిమిది మైళ్ళ దూరంలో పదారీకొట్లు అన్నీ వున్న చిన్న పట్టణంలాంటి పెద్ద వూరు వుంది. జీలకర్ర దగ్గర్నుంచి జీడిపప్పుదాకా అక్కణ్నుంచే రావాలీ వూరికి.

"...అంచేత సూరయ్యా! నువ్విక్కడే వుండి పెళ్ళికొక్కవల్సిన సామానంతా తెచ్చిపడేస్తూ వుండాలి.... అయిదు రోజుల పెళ్ళి.... అన్నట్టు బండరెళ్ళి బట్టలూ అవీ కూడా తేవాలి.... వాట్సంగతి తర్వాత చెబుతాన్లే" అన్నారు భూషయ్య గారు బిల్ల వుయ్యాలమీద వక్కపొడి నవుల్తూ పడుకుని.

"అట్టాగేనండి" అన్నాడు నిలబడే సూరయ్య.

"కూర్చో.... నిలబడే వున్నావ్" అన్నారు కాస్సేపాగి భూషయ్యగారు.

సూరయ్య గోడకానుకుని కూర్చోబోతుండగా.

"చూడ్వాడు.... కుక్కేదో వంటింటివేపువెడుతోంది" అని కంగారుపెట్టారు.

సూరయ్య కుక్కని తరిమొచ్చి కూర్చోబోతుండగా–

"అన్నట్టు....నీ పెళ్ళాం పిల్లల్ని కూడా రేపట్నుంచీ ఇక్కడే వుండమను. పెళ్ళయ్యేంతవరకు మీ అందరి అన్నాలు అవీ అన్నీ ఇక్కడే....ఆఁ....అప్పడాలు వడియాలు పెట్టడం మొదలెట్టాలా మరి .... వూఁ....పిండి వంటలూ అవీ కూడా చెయ్యడం మొదలెట్టాలి....మీ ఆవిడకి వూపిరి సలపని పని మరి. ఆఁ.... రేపే అంతా యిక్కడకొచ్చెయ్యండి.... బాపయ్య కుటుంబం కూడా యిక్కడే వుంటుంది." అన్నారు భూషయ్యగారు.

సూరయ్య కూర్చోకుండానే వెళ్ళిపోయాడు.

మొదట్రెండు రోజులూ రెండెడ్లబండి మీదే పెళ్ళి సామానంతా తెచ్చాడు సూరయ్య.... అసలు చాకిరీ ఆ తర్వాతే మొదలయ్యింది.

"కిస్‌మిస్‌పళ్ళు తేలేదేం సూరయ్యా?" సుబ్బమ్మగారి ప్రశ్న. ఆవిడ భూషయ్య గారి అర్ధాంగి.

"మీ రైతమ్మని చెప్పలేదండి."

"చెప్పకపోవటం ఏఁవిటీ? నీకు మతిమరుపెక్కువయ్యింది" సుబ్బమ్మగారి ఆరోపణ.

"ఓ పన్చెయ్యి సూరయ్యా! ఆ కంబర్తాడ్తీసుకుని ఎన్నిసామాన్లు చెబుతారోఅన్ని



ముళ్ళు ఆ తాడుకు వేసి, అది మెళ్ళో వేసుకుని వెళ్ళు....అప్పుడు మర్చిపోవు"

భూషయ్యగారి సలహా....ఆ తర్వాత గొల్లుమని నవ్వు: ఆ నవ్వాయన్దే. దానికి శృతికలిపే నవ్వుమాత్రం సుబ్బమ్మగారిది.

సూరయ్యా ఏడుపులాంటి నవ్వొకటి నవ్వటం.

"అప్పుడుమాత్రం తెమ్మన్నదితెస్తాడని నమ్మకమేముంది? ముళ్ళన్నీ విప్పదీసుకుని ముఖ్యమైనవి తేడు. చెప్పినవి తేకుండా చెప్పనివి తెస్తాడు" అంటూ సుబ్బమ్మగారు తన తెలివితేటల ప్రదర్శన, అర్థాంగి తెలివితేటల్ని మెచ్చుకుంటూ భూషయ్యగార్నవ్వటం యిదీ తంతు.

"అసలు కాగితం మీద రాసుకునే వెళ్తానండి" అని సూరయ్యా సంజాయిషీ చెప్పుకోవటం దాన్నిమాత్రం యెవ్వరూ గమనించరు— చివరికి సూరయ్యా మళ్ళీ ఆ వూరు వెళ్ళి రావాలి..ఇలా పెళ్ళయ్యేంత వరకూ రోజుకో రెండు మూడు సార్లా చిన్న పట్టణం చుట్టూ తిరగటం తప్పదు.

సుబ్బమ్మగారు మర్చిపోయిన మరే వస్తువో సూరయ్యా జ్ఞాపక శక్తిమీదదాడికి పురిగొల్పకుండా వుంటే పట్టీలోని ధరల మీద దాడిచెయ్యడం సుబ్బమ్మగారి కార్యక్రమంలో ఒక భాగం.

"ధరలు మండిపోతున్న మాట నిజంవే గానీ మరీ ఇంతగానా?! ఇంతింత ధరలా? నువ్వు రంగయ్య కొట్లోనేగా—తేవడం"— అని సూరయ్యనేదో వుద్ధరిస్తున్నట్టు మిగిలిన డబ్బు తీసుకుంటుంది.

ధరలపట్ల అనుమానం కాదని సూరయ్యకు తెల్సు. తనేం డబ్బులు వుంచుకోలేదని తెలియజేసేందుకు చొక్కా—జేబులు పైకి లాగి జేబుల్లో వున్న మట్టిని బహిరంగంగా దులుపుకుంటాడు. వాళ్ళలా చెయ్యమనిఅడగరు. కానీ రుజువు చేసుకోవాల్సిన విధి అతన్దే. వాళ్ళా తతంగం అంతా చూసి గానీ లోపలికి వెళ్ళరు.

అట్లా రుజువు చేసినా నమ్మకం కుదరక — "వచ్చేటప్పుడు మీ యింటి కెళ్ళిరాబోకు (కొట్టువాడు తూకం తక్కువ చేస్తున్నాడు. అన్న దాంట్లోని ఆరోపణలోని రహస్యం యిదే) యిక్కడ ఆ సామానొస్తేగానీ పని జరగదు. అంతగా వెళ్ళాలంటే సామానిక్కడ పడేసి వెళ్ళొచ్చు" అని హెచ్చరికలు.

ఈ నరక యాతనంతా నెలరోజుల గ్రాసం కోసం దేవుళ్ళాట తప్పించుకునేందు కతను చెల్లించే ఖరీదు.

పన్లన్నీ బల్ల వుయ్యాల దిగకుండా భూషయ్యగారు, కూర్చున్నచోట్నుంచి లేవకుండా సుబ్బమ్మగారూ పురమాయిస్తారు. ఇద్దరి శరీరాలు అంత తేలిగా లేచేవి కూడా కాదు మరి పాపం. సామాన్లు తీసుకునే పని కూడా సుబ్బమ్మగా చెయ్యడు.

"ఇవన్నీ మీ ఆవిడ కివ్వు.... శనగపప్పు యెంత కావాలో కూడా కనుక్కోవాల్ల" అంటుంది. దొడ్డి వైపు త్రవ్విన గాడి పొయిదగ్గర అరికలొత్తుతూ కూర్చున్న భార్య లేచి సామాన్లన్నీ జాగ్రత్త చెయ్యాలి. పెళ్ళి అయిదు రోజులూ వంటశాల నిర్వహణ కూడా సూరయ్యా పనే. ఇదీ పెళ్ళయ్యేంత వరకూ సూరయ్యా బాధ్యత....

* *

పెళ్ళింకా అయిదు రోజులుండగా రాత్రి పదింటికి గాడిపొయ్యి ప్రక్కన విస్తరేసి అన్నం పెడుతూఅంది సూరయ్యా భార్య అతన్తో: "చిన్నవాడు ప్రొద్దున తిన్న చద్దన్నం.. యింతవరకూ తిండి లేదు. నే నివన్నీ సర్దుకుని వచ్చేసరికి ఏ రాత్రవుతుందో? గిన్నెలో అన్నంపెట్టి యిస్తాను. తీసుకెళ్ళి వాణ్ణి లేపి తినిపించండి."

"ఏం వాడిక్కడికి రావటంలేదా?"

"వాడిప్పుడేం? పదిరోజుల్నుంచీ రావటంలేదు.నేనే రాత్రి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళి పెట్టి, మిగిలింది ప్రొద్దున పెట్టి యిక్కడ కొస్తున్నాను. మిగతా పిల్లలంతా చద్దన్నాల్దగ్గర్నుంచీ యిక్కడే కానిస్తున్నారు గానీ వాడుమాత్రం రావటంలేదు."

"ఎందుకనిట" అని అడిగాడు కానీ చిన్నవాడి సంగతి సూరయ్యకు తెల్సు కానీ వాడన్నం తినలేదన్న బాధలోంచి ఒక్క కోపం బయట కొచ్చి —

"వాడొట్టి పెంకెఘటంలా తయారవుతున్నాడే మరీను" అని త్వరగా భోంచేసి అన్నం గిన్నె తీసుకుని యింటికి బయల్దేరాడు.

పది రోజుల క్రితం వరకూ సూరయ్యా చిన్న కొడుకు అయిష్టంగానే పెళ్ళివారింటి కొచ్చి అన్నం తిని వెళ్ళేవాడు. పదిరోజుల్నాడు సూరయ్యా పిల్లలు, బాపయ్యా పిల్లలు అన్నం తింటూ వుండగా ఏం తోచక పరామర్శిస్తూ భూషయ్యగారక్కడే వున్నాడు. సూరయ్యా చిన్నకొడుకు.వాడి పేరు ప్రసాదం-పచ్చడి కలుపుకుని అలవాటు ప్రకారం నెయ్యికోసం చూడకుండా

ముద్ద నోట్లో పెట్టుకుంటూండగా భూషయ్యగారు–

"ఒరేయ్ ప్రసాదం! నెయ్యివేసేవరకూ ఆగరా. నీ ఆకలి కూలిపోనూ.... ఆఁ....ధార లేని తిండి దయ్యపుతిండిరా.... నీ ఆత్రం కూలా.... వెయ్యవమ్మా వాడికి మరికాస్త నెయ్యి వెయ్యి" అన్నారు.

ప్రసాదం తినటం ఆపకుండా ఆయన వంక నిర్లక్ష్యంగా చూసి – "నాకు నెయ్యంటే దోకు" అన్నాడు.

ఆర్భాటం చేసేవాడల్లా ఠక్కున ఆగి కాస్సేపు పరిశీలనగా కుర్రవాడి వంక చూశారు భూషయ్యగారు. కుర్రాడికి నిండా యెనిమిదేళ్లుండవ్– వీడి సంగతేఁవిటీ అన్నట్టు చూసి-తర్వాత యథాప్రకారం నవ్వారు. కానీ ఆ నవ్వులో గంభీరం మచ్చుకైనా లేదు.


ఆ రాత్రి వాళ్ళమ్మ యింటి కొచ్చేంత వరకూ మేలుకుండి –


"అయినా వాళ్ళింట్లో పెళ్ళి ఇంకా ఎన్నో రోజులుంది.మనంరోజూవాళ్ళింట్లో తింటం ఎందుకు?నేను రేపట్నుంచీ రాను" అన్నాడు.

ఆ మర్నాట్నుంచీ అన్నంత పనీ చేస్తున్నాడు. వాళ్ళమ్మే ఇంటికి అన్నం తెచ్చేది .... వాళ్ళింట్లో పొయ్యి దాదాపు తవ్వివేసినట్టే. అదీగాక పెళ్ళిపనులుకూడా జోరుగా జరుగుతున్నయ్.

పెళ్ళిరోజు రానే వచ్చింది. బజారంతా పందిరి వేశారు. పిల్లలందరూ పందిళ్ళ వెంట పరుగు లెడ్తున్నారు. పెళ్ళినాటికి సూరయ్య పిల్లలందరూ గుడ్డల్ని సాధ్యమైనంత తెల్లగా వుతికించి వుంచుకున్నారు. ప్రసాదం చొక్కా, లాగూల్ని బొంతక్రింద పెట్టి "దిండు" ఇస్త్రీ కూడా చేశాడు. "చెంబు" ఇస్త్రీ చేద్దామంటే యింట్లో పొయ్యే అంటించటం లేదు మరి.

ముహూర్తం వేళ్టికి ఆ చొక్కా లాగూ వేసుకుని పెళ్ళి వారింటికి వెళ్ళాడు. అంత వరకూ "పెద్దమనిషి" మాదిరే వున్న ప్రసాదం అక్కడ పిల్లల్ని చూసి వాళ్ళలో కల్సిపోయి భూషయ్యగారి యిల్లంతా పరుగు లెటడం మొదలెట్టాడు. కాస్సేపు బ్యాండుమేళం వాళ్ళదగ్గిర గంతులేశాడు. మరి కొంత సేపు పందిరి గుంజల్పట్టా





తిరుగుతూ దొంగాట ఆడారు. ఇలా ఎగురుతూ వుండగా వాడిలాగూ వెనకవైపున 'ఫర్' మని చిరిగిపోయింది.

హాయ్.. హాయ్.. పోస్టాఫీసు.. వుత్తరాలెయ్యండిరా" అంటూ అంతా కాగితమ్ముక్కలు యేరి వాడి లాగూకున్న చిరుగులో వేస్తూ దాన్ని పెద్దది చేశారు. వాడి కేడుపొచ్చింది. కోపం వచ్చింది. అందరి మీదా కలియబడ్డాడు. కొందర్ని కొట్టాడు. అందరిచేతా తన్నులు తిన్నాడు. 'దిండు' ఇస్త్రీ చేసిన వాడి చొక్కా నలిగిపోయింది. దాన్నిండా దుమ్ము కూడా కొట్టుకుంది. ఏడుస్తూ పందిట్లోంచి వెళ్ళిపోయాడు.

ముహూర్తం ప్రొద్దున యేడు గంటలకే అయిపోయింది. ఆహూతు లందరకూ వుప్మా, కాఫీలు యిస్తున్నారు. విడిదిలోకి అవి అంతకుముందే వెళ్ళినయ్. సూరయ్యా అతనిభార్య అందరికీ వుప్మా అందిస్తున్నా వాళ్ళ కళ్ళు మాత్రం ప్రసాదం కోసం వెదుకుతున్నయ్.

"వెధవకి కరివేపాకులు మాడిపోకుండా వున్న వుప్మా, జీడిపప్పులున్న వుప్మా అంటే చాలా యిష్టం.... ఎంచేత రాలేదో" అని చాలాసార్లనుకుంది వాడి తల్లి.

సూరయ్యా పెద్ద కొడుకుని అడిగాడు. "ప్రసాదం ఎక్కడ్రా?" అని. వాడూ చూశ్చేదన్నాడు. పెద్దవాడన్నమాటేగానీ వాడికి పన్నెండేళ్ళకంటే ఎక్కువ వయసుండదు. వాడు మిగతా నలుగురు చిన్న పిల్లల్ని చూసుకోవాలి. వంటగదికి ఇరవై గజాల దూరంలో కూర్చుని ఆ పిల్లల నాడిస్తూ వాళ్ళక్కావల్సినవి ఎవరూ చూడకుండా పెడ్తూనే వుంటాడు. వాడితో పేచీ ఏం లేదు. పెదవాడి మాదిరి బ్రతకలేకపోయినా, వాడి ప్రక్కనవున్నా ప్రసాదం సంగతి కనిపెట్టే వీలు పెద్దవాడి కుండేది. ప్రసాదం అదీ అనుకూల పడనివ్వడు.

పది గంటల్దాటింది. రెండో తడవ. మూడో తడవ కాఫీల్తాగే వాళ్ళ నొదిలేస్తే ప్రొద్దున కాఫీ వుప్మాల తతంగం అయిపోయినట్టే సూరయ్యా, అతని భార్యా వుప్మాతిని కాఫీల్తాగినా ప్రసాదం తిన్నాడో లేదోనని ప్రాణం కొట్టుమిట్టాడ్తోంది.... దూరంగా దొడ్లో చాకలి లచ్చి, ఆమె మొగుడు వీరప్ప భూషయ్యగారి కోడల్తో తగూపడ్తున్నారు....

"ఎంతుప్మానమ్మా పెట్టేది.... నా పిల్లలకి బుగ్గకిందకూడా రాలేదు.... చూస్తే ఈ గుండిగెలన్నీ తోమాల మళ్లీ.... హుం...." అంటోంది లచ్చి....

"ఎందుకు పెట్టంవే.... పంపిస్తానుండు ....నువ్వేరవమోకు.... నీ గొంతసలే చాలా చిన్నది" అంటోంది కోడలు నవ్వుతూ.

"తొరగా పట్రండి.... నా గొంతసలు సిన్నదిగాదు" అంది లచ్చి.

సూరయ్య భార్య పెద్ద కుర్రాణ్ణి పిల్చింది.

"ఒరేయ్ పెద్దాడా! ఈ ఆకులో వుప్మా ఇస్తాను....ప్రసాదం ఇంట్లో వున్నాడేమో చూసి ఇచ్చిరా" అని ఆకు చేతిలోకి తీసుకుంది. ఇంతలో సుడిగాలిలా వచ్చాడు బాపయ్య.

"ఏంవమ్మా....ఇంకా వుప్మా వుందా.... బ్రతికించావ్. పెళ్ళికొడుకు స్నేహితులొచ్చార్ట.... వుప్మా పంపమని కబుర్లేశారు. అయినా (రహస్యంగా) పది గంటలవుతుంటే ఇప్పుడు వుప్మాలట.... పద.... పద ఈ బేసిన్ పట్టుకుని బయలేరు విడిదికి అంటూ కంగారు పెట్టాడు బాపయ్య.. చేతిలోకి తీసుకున్న ఆకుని బేసిన్ క్రిందపేసి, దాన్ని భుజానికెత్తుకుని విడిదింటి వైపుకు దార్తీసింది సూరయ్య భార్య.

ప్రసాదం యింటికి చేరిన వెంటనే చిరిగిన లాగూని తనకు చేతనయినట్టు కుట్టుకున్నాడు. అరిగిపోయిన చిన్న సబ్బు ముక్క తీసి నూతి దగ్గర చొక్కా, లాగూ వుతికాడు. ఆ రెంటినీ యెండలో ఆరేసి తుండుగుడ్డ కట్టుకుని వా టెదురుగా కూర్చున్నాడు. చొక్కా తడి పొడిగా ఎండింది గాని, లాగూ మాత్రం ఎండలేదు. లాగూ గుడ్డ "మొద్దు" గుడ్డ. పడుంటయ్యని రెండేళ్ళ క్రితం ముతకగుడ్డ కొని కుట్టించారు.

పన్నెండు దాటింది....సూరయ్యకు వంటవాళ్ళకి అవీ యివీ అందించటంతోనూ, అతని భార్యకు పెళ్ళి కూతురివైపు వచ్చిన చుట్టాల అవసరాలు గమనించటంతోనూ, మధ్య మధ్య విడిదికి వెళ్ళిరావటంతోనూ సరిపోతోంది.

మధ్యాహ్నం వంటి గంటకల్లా విస్తళ్లు వేశారు... సూరయ్యా తన పిల్లలే వరసలో వున్నారా అని చూస్తున్నాడు .... చిన్న బిందెతో మంచినీళ్ళు పోస్తూ బాపయ్య కూడా చుట్టూ చూసుకుంటున్నాడు తన పిల్లలెక్కడ అని....సూరయ్యకి అతని పిల్లలు కనిపించారు; పెద్దవాడు నలుగురు పిల్లల్నీ చెరివైపునా ఇద్దర్నొప్పున కూర్చోబెట్టుకుని పిల్లల కోడి మాదిరి కూర్చున్నాడు. వీడితో బెంగే లేదు. వీడికి పూర్తిగా తర్ఫీదిచ్చేశాడు తను. సాయంత్రం పిల్లలు ఇంట్లో ఏడ్చినా యిబ్బంది లేకుండా విస్తరిముందు నుంచి లేచేసరికి వక్కరెండు పిండి వంటకాలు చేతిలో వుంచుకుంటాడు. పిండివంటల పళ్ళెం పుచ్చుకుని తన పిల్లలు కూర్చున్న

వరసకొక సారైనా తప్పకుండా వెళ్ళొస్తాడు సూరయ్య. కానీ ఈ ప్రసాదం గాడ్తోనే వచ్చింది చిక్కు, అసలు వీడేడీ? ఎక్కడా కనపడ్డేం ? !

సూరయ్య వంట పందిట్లోకి వెళ్ళాడు. మాయాబజారు సినిమాలో మాదిరి పదార్థాలన్నీ బారు తీసి నిలబడున్నయ్. ఇక వడ్డించెయ్యటమే తరువాయి.... అదిగో విడిదిలోంచి సన్నాయిమేళం వినిపిస్తోంది. పెళ్ళివారు భోజనాలకి బయల్దేరారన్నమాట. ఈ ప్రసాదంగాడు భోజనానికి బయల్దేరాడో లేదో?

"సూరయ్యా!....బాపయ్యా!....కిష్టుడూ వడ్డన కానిచ్చెయ్యాలి. ఆ నేతి యూనీ యిటివ్వండి నాకు."

"అన్నట్టు మేళగాళ్ళకి భోజనాలకు ముందు కాఫీ కావాల్ట."

"డికాషనుందిగా., పాలెక్కించి పంపించెయ్యండి."

గరిట్ల చప్పుళ్ళు.... పట్టు చీరెల గరగరలు....

"అన్నట్టూ చేత్తోనే కాఫీ డ్రయివర్లక్కూడా పంపమంటున్నారు వియ్యంకుడు గారు"

"అట్లాగే.... తప్పకుండా."

"విడిదిలో పసిపిల్లలకి పాలు పంపించారా ?"

"బాబూ.... గోంగూర.... బాబూ గోంగూర."

"అయ్యా....అరటి కాయకూర".

సూరయ్య ప్రతి మనిషి మొహంలోకి చూసి మరీ వడ్డిస్తున్నాడు. ఈ కుర్రాడు నాలుగు తడవలు పుష్మాతిని అప్పుడే భోజనానికి వచ్చాడేం....రెండో బంతికి రాకూడదూ?! మొదటి బంతిలో మందెక్కువయ్యారు. వడ్డన కలపడంలేదు. సూరయ్య పళ్లెంలో అన్నం అయిపోయింది. లోపలికెళ్ళాడు.

జిలేబీల పళ్ళెం కనిపించింది....ప్రసాదానికి జిలేబీలంటే చాలా యిష్టం....

"సూరయ్యా రావాలి.... అన్నపళ్ళెం యిట్రావాలి"

ఎవరో ఓ పద్యం యెత్తుకున్నారు. మజ్జిగలో కొచ్చేం తర్వాత భగవంతుడు గుర్తుకొచ్చాడు. 'భోజన మధ్యే భగవన్నామస్మరణ....' అన్నాడు పైగా. ఆ చివర్నో పది మంది పిల్లలు లేచారు....

పెళ్ళికొడుకు వేపు వాళ్ళు కబుర్లలో పడ్డారు. మితంగానూ, పుష్టిగానూ తిన్న తర్వాత "యెట్లా భోంచేసేది.. వియ్యాలవారివిందు మేం యెట్లా భోంచేసేది" అంటూ పాటందుకున్న దొకావిడ.

ప్రసాదం లాగూ ఆరింది. అది వేసుకుని పెళ్ళివారింటికి బయల్దేరాడు. పందిట్లో కొచ్చేసరికి అందరూ తాపీగా తమలపాకులు వేసుకుంటున్నారు. సూరయ్య దూరంనుంచి చూశాడు ప్రసాదాన్ని.

"వరేయ్....రా....రా" అన్నాడు. ప్రసాదం అటువైపు నడిచాడు. ఇంతలో


ఇవే మా దీపావళి శుభాకాంక్షలు!

నిరాశ జీవితానికి ఆశాజ్యోతి



డా॥ రాయ్
గుప్త రోగముల
నివారణ నిపుణులు

అనేకమంది స్త్రీ-పురుషులు ధనాఢ్యులై వున్నా, సౌందర్యవంతులై వున్నా-జీవితముపై నిరాశ చెంది వుంటారు. కారణం? జీవితములో పొందవలసిన ముఖ్యమైన సుఖం పొందలేకపోవడమే.

మా 27 సంవత్సరాల అనుభవం, కృషితో తయారుచేసిన మందు లను వాడి జీవితములో సంపూర్ణ సుఖమును అనుభవించండి.

మా ప్రత్యేకత: నరముల బలహీనత విద్యుచ్ఛక్తి యంత్రములచే బాగుచేయబడును.


సందేహించకండి-మీ జీవితం ఆనందదాయకంగా చేసుకోండి.

సంప్రతించు వేళలు: ఉ॥ 8-00 నుండి 1-00 వరకు సా॥ 4-00 నుంచి 9-30 ల వరకు

రాయ్ మెడికల్ హాల్

అలంకార్ టాకీస్ ఎదుట, విజయవాడ-3 ఫోను : 74658.

(ఆదివారం కూడ తెరచి ఉంచబడును)



ఒకడు పరిగెత్తుకుంటూ సూరయ్య దగ్గరి కొచ్చి—

"నువ్విక్కడున్నావా?....రావయ్యా బాబూ రా....అన్నం ఖాళీ అయింది. ప్రొద్దున బియ్యం పోసింది నువ్వేగా....ఆ మానిక యెక్కడ పెట్టావ్....రెండో బంతి లేచేలోగా గుండిగ వార్చాలి.......వెళ్ళి బియ్యం పొయ్యి" అని తరిమాడు.

ప్రసాదం చేరుకునేసరికి సూరయ్య లోపలికెళ్ళాడు. ప్రసాదం రెండో బంతి లోకి వెళ్ళి కూర్చోబోతూండగా –

"అబ్బాయ్.... కాస్సేపాగు.... తర్వాతొద్దుపుగాని" అన్నాడు. యిందాక సూరయ్యని బియ్యం పొయ్యమని లోనికి తరిమినవాడు. అన్నం గుండిగ దిగేలోగా అభాసుకాకుండా చూడాలని ఆయన ఆదుర్దా.

ప్రసాదం నిలబడ్డాడు. ప్రసాదం అన్నయ్య వాణ్ణి పిలుస్తున్నాడు. "ఒరేయ్ .... యిట్రా.... యిటొస్తే యిదిస్తాను" అన్నట్టు జేబు వంక చూపిస్తున్నాడు. వాడప్పటికే రెండు జిలేబీలు జేబులో సమకూర్చుకున్నాడు.

"ఛీ....పో" అని తలెగరేశాడు ప్రసాదం.

ఇంతలో ఎవరో చిటికెవేసి ప్రసాదాన్ని పిల్చారు. "చూడు బాబూ....నువ్వు శ్రీ స్మార్ట్‌గా వున్నావ్....ఈ రూపాయి తీసుకుని ఈ సిగరెట్టు పెట్టె వుంటే ఇలాంటిదే ఒకటి కొనుక్కురారా....ఆఁ.... ఇక్కడున్నట్టొచ్చెయ్యాలి....ఎంత తొందరగా వస్తావో చూస్తాను....పరుగెత్తుమరి" అన్నాడాయన తమలపాకులు నముల్తూ.

ప్రసాదం రూపాయి తీసుకుని పరిగెత్తాడు.

ప్రసాదం తిరిగొచ్చి సిగరెట్టు పెట్టె, చిల్లర డబ్బులు ఆయన కిచ్చాడు. ఆయన ప్రసాదం వంక చూడకుండా వాట్నందుకుని తనెదురుగా కూర్చున్నాయన్తో మళ్ళా వాదనలోకి దిగాడు....

"అదయింది సరే.... మళ్ళీ రంగంమీద కొస్తోందావిడ.... యిప్పుడ్చూడాలి" అంటూ.

ప్రసాదం ఆయాసంతో రొప్పుతూ అక్కడ చాపమీద కూలబడ్డాడు. నూతి దగర నీళ్ళు తోడ్తున్నారెవరో .... ఒక బకెట్టు నీళ్ళు తాగి మళ్ళీ పందిట్లో కొచ్చాడు ప్రసాదం....

"నా నాలిక పండింది" అంటూ వచ్చాడో కుర్రవాడు.

"నా నాలికే బాగా పండింది" అన్నాడు ప్రక్కవాడు.

"ఏదిరా ప్రసాదం! నీ నాలిక చూపించు" అన్నాడొకడు.

ప్రసాదం చూపించాడు.

"ఒరేయ్....వీడి నాలికసలు పండలేదురోయ్....అయితే వీణ్ణి వీడిపెళ్ళాం కొడ్తుందన్నమాట" అంటూ తెగనవ్వాడింకొకడు.

"నేనసలు తమలపాకులు వేసుకోలేదురా మొహఁవా!" అన్నాడు ప్రసాదం.

"నే తెస్తాను....వేసుకుని చూపించయితే....పందెం నీకు పండదు" అని లేచాడవతలి కుర్రాడు.

ప్రసాదం ఆకులూ, వక్కపొడీ నఁమిలాడు. మరింత సున్నం రాసుకుని మరీ నమిలాడు....బాగా పండింది వాడి నాలుక. పిల్లల్లోచేరి ఎగరటం మొదలెట్టాడు. వాడి కాకలికూడా వెయ్యటంలేదు.

సాయంత్రం నాలుగ్గంటలకు గాడిపొయ్యి ప్రక్కన ఛోంచేస్తూ అంటున్నాడు బాపయ్య.

"మీ ప్రసాదాన్ని నేం జూశాలేవయ్యా! తమలపాకు వేసుకుని ఆట్లాడ్తున్నాడు. రెండో బంతిలో వచ్చి తినుంటాడు.

సాయంత్రం ఆరు గంటలయింది. అంతకుముందే విడిదిలోకి ఫలహారాలిచ్చేందు కావిడ వెళ్ళింది. సన్నాయి మీద త్యాగరాజ కృతులు వాయిస్తున్నారు మేళగాళ్ళు.... ఆడవాళ్ళందరూ ముస్తాబవుతున్నారు.

సూరయ్య బంగాళా దుంపలు తరుగుతున్నాడు. ఎవరో కుర్రాడు లాగూ పైకి లాక్కుంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు. వాడు ఆయాసంతో రొప్పుతున్నాడు.

"సూరయ్యగారూ, మీ చిన్నబ్బాయి కరణంగారి వీధరుగుమీంచి పడిపోయాడు" అన్చెప్పాడు. సూరయ్య పంచె సర్దేసుకుంటూనే పరిగెత్తాడు.

ప్రసాదం మెట్లమీద పడున్నాడు. ముఖంమీద నీళ్ళు జల్లుతున్నారెవరో.... డొక్కలెగిరెగిరి పడ్తున్నయ్.

"ప్రమాదం ఏంలేదు లేవయ్యా! ఆ తిండీ ఈ తిండీ తినుంటాడు .... కొంచెం పైత్యంచేసి కడుపులో త్రిప్పి కళ్లు తిరిగుంటయ్" అన్నాడొకాయన.

"ఆఁ... అంతే.... పైగా మకాం పెళ్ళివారింట్లోనేగదా... మరింకా తక్కువేఁవిటీ" అన్నా డింకో కుశాగ్రబుద్ధి.

ప్రసాదం పొట్ట లోనికి పోయివుంది. ప్రసాదమే లేచి నిన్న ప్రొద్దునవించీ ఏం తిన్లేదని చెప్పినా యెవ్వరూ నమ్మరక్కడ.

ప్రసాదం యింకా కళ్ళు తెరవలేదు. వాడికి శోషవచ్చి వుండాలి. సూరయ్య బలవంతంగా వాడి నోరు తెరిచి నోట్లో నీళ్ళు పోశాడు. వాడు గుటకలు వేశాడు.

"ఏఁవిటయ్యా!.. ఏఁవన్నా లడ్డూలు అవీ తెగతినిపించావా?" అంటున్నాడు రహస్యంగా బావయ్య ప్రక్కనే కూర్చుని.

సూరయ్య ఏదో లోకంలోకి చూస్తున్నట్టు చూశాడతని వంక....

సూరయ్య తనేదో మధ్య తరగతి మనిషినని నమ్ముతూవుంటాడు. అందుకే అతనికీ అధోగతి. అతని కంటే పై మెట్టు మీదున్న వాళ్ళు అతని జుట్టు పట్టుకుని ఆ తరగతిలోని క్రింది మెట్టు మీదకి అతన్ని ప్రేళ్ళాడతీస్తున్నారు. అట్లా నిలబడితే యిదిగో యిట్లాగే వూపిరాడని పరిస్థితి వస్తుంది. ఆ మెట్టు వదలి క్రిందకి అతను దిగగలిగితే తనంత తను నిలబడగలడు. కానీ ఆ ధైర్యంలేదు. చస్తూ బ్రతికే పిరికితనానికి మాత్రం లోపం లేదు.

కూలి జేసుకునే వాడికి తన జీతం రాళ్ళు నిలదీసి వసూల్జేసుకునే వీలుంది. ఆ జీతంతో తన ఇష్టం వచ్చినట్టు పిల్లలకి పెట్టుకోవచ్చు; తను తినొచ్చు .... చివరికి ముష్టివాడిక్కూడా తగినంత స్వేచ్ఛవుంది. అది లేంది సూరయ్యలాంటి వ్యక్తులకే.... తనేం చెయ్యాలో ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు. ఇక్కడ భూషయ్య దగ్గర కూలి చేసే బదులు అదే పని పట్నం పోయి స్వేచ్ఛగా చెయ్యొచ్చు.

"కుర్రాడు లేస్తాడుగానీ నువ్వు తొందరగా వచ్చెయ్. వంటవన్నీ చూడాలి" అని బావయ్య పరుగులాంటి నడకతో వెడుతూంటే అతనివంక నిర్లక్ష్యంగా చూశాడు సూరయ్య .... ఆకాశంలోకి చూస్తున్నాడు సూరయ్య.... ప్రసాదాన్ని బ్రతికించమని కనిపించని దైవాన్ని పైకి వినిపించని మాటల్తో ప్రార్థిస్తున్నాడు.

"మేఁవంతా చచ్చిపోయి బ్రతుకుతున్న వాళ్ళం; చచ్చి చెడి బ్రతుకుతున్న వాళ్ళం. మాకు చావులేదు. యెన్నడో చచ్చిపోయాం గనుక. అదంటే మాకు భయంలేదు. రోజూ



"నరకాసుర వధ" చిత్రం : కె. జి. కె., చీరాల

చస్తూనే వుంటాం గనుక. అంతేకాదు.... మాకు చావు రాదు. అది మా దగ్గరి కెన్నడో వచ్చేసింది గనుక .... కానీ .... ఈ చచ్చిపోయిన వాళ్ళ మధ్య బ్రతికున్నది వీడొక్కడే.... వీణ్ణి చంపెయ్యకు భగవంతుడా ....నువ్విప్పుడు వీణ్ణి బ్రతికిస్తే మళ్ళీ నువ్వువాణ్ణి పిలిచేదాకా వాడు చావకుండా బ్రతికిస్తాను. నాకీ ఒక్క అవకాశం ఇవ్వు భగవాన్....అంటూ గుండెలోనే ఏడ్చాడు సూరయ్య.

సూర్యుడు పశ్చిమాన కృంగిపోయాడు.. చీకట్లు ముసురుతున్నయ్ .... పెళ్ళివారింట్లో బ్యాండు మేళం మ్రోగుతూనే వుంది.

కుర్రాణ్ణి భుజానవేసుకుని ఇంటివైపు బయల్దేరాడు. ఆకాశం వైపు చూస్తూ అనుకున్నాడు సూరయ్య, "నువ్విప్పుడు వీణ్ణి చంపినా వీడు చావులేని మనిషే. అలాంటి పరిస్థితుల్లో నువ్వుండి వాడి మాదిరి చావకుండా వుంటే అప్పుడూ నీ గొప్పతనం. కానీ నువ్వాపన్చెయ్యలేవు.. అంచేత వీణ్ణి చావకుండానన్నా చూడు' .... పిచ్చిగా నవ్వాడు.... ★